
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
బుధవారం 3 జూలై 2024



వ్యాధులను గుర్తించకుంటే చర్యలు: డీఎంవో

కొమరాడ, జూలై 2 : మలేరియా, డెంగ్యూ, తదితర సీజనల్ వ్యాధులను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్మోహన్‌రావు హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దేశించారు. మంగళవారం కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్షించారు. సీజనల్ జ్వరాల నమోదు.. అందిస్తున్న చికిత్స, వ్యాధుల నివారణ చర్యలు.. తదితర అంశాలపై ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో జ్వర నిర్ధారణ పరీక్షలు చేయాలని, వెల్‌నెస్ కేంద్రాల ద్వారా వైద్య సేవలందించాలని, శిశువులు, గర్భిణుల ఆరోగ్యాలను పర్యవేక్షించాలని సూచించారు.

20 శాతం పనులూ పూర్తిచేయించలే..


అడారుగెడ్డ రిజర్వాయర్

- అడారు గెడ్డపై గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ఎన్నికల్లో హామీ ఇచ్చి.. మరిచిపోయిన వైనం
- రిజర్వాయర్, జంఝావతి హైలెవల్ కెనాల్ నిర్మాణాలకు కలగని మోక్షం
- సాగునీటి కోసం రైతుల ఎదురుచూపు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు

పార్వతీపురం రూరల్, జూలై 2:

జిల్లాలో కీలక సాగునీటి వనరులైన అడారుగెడ్డ రిజర్వాయర్, జంఝావతి హై లెవల్ కెనాల్ పనులకు మోక్షం కలగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. తుది దశకు చేరుకోవడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఏటా వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆయా పనులు పూర్తిచేస్తామన్న గత వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. ఐదేళ్లు.. వాటి నిర్వహణను పట్టించుకోలేదు. సక్రమంగా నిధులు కేటాయించక పోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఆయకట్టుదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఏటాలానే ఈ సారి కూడా సాగునీటి కష్టాలు తప్పేలా? లేవని మథనపడుతున్నారు. ప్రస్తుతం వారంతా నూతన ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. మిగిలి ఉన్న నిర్మాణాలు పూర్తిచేసి సాగునీటి ఇక్కట్లు తొలగించాలని వారు కోరుతున్నారు.


పిచ్చిమొక్కలతో నిండిన జంఝావతి హైలెవెల్ కెనాల్

ఇదీ పరిస్థితి..

పార్వతీపురం మండలం అడారు ప్రాంతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సుమారు 600 ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో పనులు ప్రారంభించారు. అయితే నేటికీ అడారు గెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాలేదు. సుమారు రూ.ఐదు కోట్లతో 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 20 శాతం పనులు మాత్రం పూర్తి కాకపోవడంతో పార్వతీపురం, మక్కువ మండలాల పరిధిలో ఆయకట్టుదారులు సాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. ఈ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామని ఎన్నికల సమయంలో వైసీపీ నేతలు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత దాని ఊసే మరిచారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

వాస్తవంగా గత టీడీపీ హయాంలో అడారుగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు. అయితే ఈలోపుగా ఎన్నికలు జరగడం.. వైసీపీ అధికారంలోకి రావడంతో సీన్ మరింది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయితే పార్వతీపురంతో పాటు మక్కువ మండల రైతులకు ఎంతో ఉపయోగం ఉన్నా.. ఆ దిశగా వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

ఆ పనులు పూర్తి చేస్తే..

అడారు గెడ్డ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే.. మరికొన్ని వందలాది ఎకరాలకు సాగునీరు అందనుంది. ఇదిలా ఉండగా జంఝావతి హైలెవెల్ కెనాల్ పనులు కూడా పూర్తయితే పార్వతీపురం మండలంలో లక్ష్మీనారాయణపురం, చినబండపల్లి, తాళ్లబురిడి, పెద్ద బండపల్లి తదితర గ్రామాల రైతుల వ్యవసాయ భూములకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఈ పనుల కోసం గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత రివర్స్ టెండరింగ్ పేరిట పనులు రద్దు చేసింది. దీంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోవడంతో జంఝావతి హైలెవెల్ కెనాల్ పనులు పూర్తి కాలేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి.. తగు చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి..

అడారుగెడ్డ ప్రాజెక్టును పూర్తి చేసి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే పంట భూములకు సాగునీరు అందుతుంది. ఈ ప్రాంత రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పూర్తిగా పట్టించుకోలేదు. పార్వతీపురం మండలంలోని 30 పంచాయతీల పరిధిలో రైతులు ఏటా సాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనిపై నూతన ప్రభుత్వం, ఇరిగేషన్ శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

-జి.సాయిరామకృష్ణ, మాజీ సర్పంచ్, డీకేపట్నం

రూ.20 కోట్లు అవసరం..

అడారుగెడ్డ రిజార్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలంటే సుమారు రూ.20 కోట్లు అవసరం. భూసేకరణతో పాటు మిగిలిన పనులను పూర్తి చేయాలి. దీనిపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలను పంపించాం.

- అప్పలనాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఇరిగేషన్ శాఖ

వణికిస్తున్నాయి

- ఆశ్రమ పాఠశాలల విద్యార్థులపై జ్వరాల పంజా
- కొందరిలో మలేరియా లక్షణాలు
- సాలూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స

సాలూరు రూరల్, జూలై 2: సీజన్ మారడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు జ్వరాలతో వణుకుతున్నారు. అత్యధికులు మలేరియాతో బాధపడుతున్నారు. ఇప్పటికే సాలూరు మండలం కురుకూటి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థునులు మలేరియాతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని మంగళవారం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థునులంతా అక్కడ చికిత్స పొందుతున్నారు. అదే పాఠశాలలో మరో విద్యార్థిని తలనొప్పితో బాధపడుతుండడంతో తోణాం పీహెచ్‌సీ వైద్యుడు వెళ్లి చికిత్స అందించారు. గిరిశిఖర గ్రామలైన బెల్లపాక, నారింజపాడు, బొడ్డపాడు తదితర గ్రామాల నుంచి కురుకూటి పాఠశాలలకు వచ్చిన విద్యార్థినుల్లో కొందరికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో గత నెల 27, 29 తేదీల్లో తోణాం పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ నెల 29న పాఠశాలలో 40 మంది విద్యార్థులను నుంచి రక్తపూతలను వైద్యసిబ్బంది సేకరించారు. అయితే అప్పటికి వారిలో ఎవరికీ మలేరియా లక్షణాలు కనిపించలేదు. తాజాగా పాఠశాలలో 11 మందికి విద్యార్థినులు అస్వస్థతకు గురవడంతో ప్రధానోప్యాయుడు ప్రసన్న గణేష్ వారిని సాలూరు ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ఇదిలా ఉండగా మామిడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన ఒక విద్యార్థిని జ్వరంతో బాధపడు తుండడంతో సోమవారం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. కొత్తవలస ఆశ్రమ పాఠశాలలో ఇరువురు విద్యార్థునులను తాజాగా సాలూరు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించామని హెచ్‌ఎం సంధ్యారాణి చెప్పారు. మావుడిలో ఐదుగురు విద్యార్థులకు మామిడిపల్లి పీహెచ్‌సీలో చికిత్స అందించడంతో ఆరోగ్యం మెరుగుపడిందని వార్డెన్ ఒంటి శంకరరావు చెప్పారు. అంటివలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాలుగు రోజుల కిందట పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురవ్వగా 104 వాహన సిబ్బంది వైద్యసేవలందించినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.


సాలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురుకూటి ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

పర్యవేక్షిస్తున్నాం..

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించాం. మన్యం సిక్ మానిటరింగ్ యాప్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నాం. అనారోగ్యంగా ఉన్న విద్యార్థులకు సత్వర వైద్యసేవలందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

- శ్రీనివాసరావు, ఏటీడబ్ల్యూవో, సాలూరు

మెరుగైన వైద్య సేవలందించండి

- వైద్యులకు మంత్రి సంధ్యారాణి ఆదేశం


సాలూరు ఆసుపత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు : విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వైద్యులను ఆదేశించారు. సాలూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురుకూటి, మామిడిపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించారు. ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందని వారిని అడిగి తెలుసుకున్నారు. ఏది అవసరమైనా తనను సంప్రదించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రి ఆవరణలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వినోద్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తక్షణమే వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ రుగ్మాంగదయ్యకు ఫోన్‌లో మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే అందజేయాలని, వసతి గృహాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఆశ్రమ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, వార్డెన్‌లు అప్రమత్తంగా ఉండా లన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ఏఎన్ఎంల నియామకంపై చేసిన ప్రతిపాదనలను సత్వరం అమలు చేయనున్నామని తెలిపారు. మంత్రి వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిరుపతిరావు, నాయకులు ప్రసాద్, పరమేష్, వేణు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌గా శ్యాంప్రసాద్

- పల్నాడు జేసీగా పనిచేస్తూ పదోన్నతిపై రాక
- ప్రస్తుత కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు స్థానభ్రంశం

పార్వతీపురం, జూలై 2(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎ.శ్యాంప్రసాద్ నియామకమయ్యారు. 2016 సివిల్ సర్వీసెస్ బ్యాచ్‌కు చెందిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు రానున్నారు. జిల్లాకు రెండో కలెక్టర్‌గా శ్యాంప్రసాద్ నియామకమయ్యారు. త్వరలోనే ఆయన విధుల్లో చేరనున్నారు. జిల్లా మొదటి కలెక్టర్‌గా పనిచేసిన నిశాంత్‌కుమార్ గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యను పరిష్కరించడంలో, రైతులకు అవసరమైన సేవలను అందించడంలో శ్రద్ధ కనబరిచారు. గిరిజన ఇంజనీరింగ్ కళాశాల, కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు, వైద్య కళాశాలకు స్థల సేకరణ చేయడంలో చొరవ చూపారు. జిల్లా కేంద్రంలో సైకిల్‌పై తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసు కున్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో సచివాలయాల్లో అభిలాష పేరిట గ్రంథాలయాలను ఏర్పాటు చేయించారు. సివిల్ సర్వీసెస్, ఇతర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నారు.



కొత్త కలెక్టర్ శ్యాంప్రసాద్, బదిలీపై వెళ్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



ముక్కుమూసుకుని.. మురుగు నీటిని దాటుకుని..

ఇది పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పరిస్థితి. ఇన్‌గేట్ వద్ద రోడ్డు మీదకు ఇలా మురుగునీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన కూడా వెలువడుతుండడంతో ముక్కుమూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అక్కడున్న మరుగుదొడ్లను సరిగ్గా వినియోగించడం లేదు. మిగతా స్థలంలో ఇలా మురుగు నీరు చేరడంతో.. బస్సుల కోసం నిరీక్షించే వారు నానా అవస్థలు పడుతున్నారు. కాస్త వర్షం పడితే .. ఆ ప్రాంతం మరింత అధ్వానంగా మారుతుంది. దీనిపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- పాలకొండ

అప్‌గ్రేడ్ చేశారంతే..

(సీతంపేట)

- ఇదీ గత వైసీపీ సర్కారు నిర్వాకం
- జిల్లాలో రెండు హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్పు
- వసతుల కల్పన, అధ్యాపకుల నియామకానికి చర్యలేవీ..
- ఇంటర్ విద్యార్థులకు ఉపాధ్యాయులతో బోధన

గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆదరాబాదరాగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. స్థానికంగా ఉన్న హైస్కూల్‌ను అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే మౌలిక వసతుల కల్పనపై మాత్రం దృష్టి సారించలేదు. అధ్యాపకుల నియామకం కూడా చేపట్టలేదు. దీంతో ఇంటర్ విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ప్రస్తుతం హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులే పాఠ్యాంశాలు బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో గరుగుబిల్లి, సీతంపేట ప్రభుత్వ హైస్కూళ్లను జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ.. గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా చోట్ల ఈ ఏడాది ఇంటర్‌లో ప్రవేశాలకు చర్యలు తీసుకున్నారు. సీతంపేటలో బైపీసీ, ఎంపీసీ గ్రూప్‌లను ఏర్పాటు చేయగా.. ఒక్కోదానిలో 40 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఇంతవరకు బాగానే ఉన్నా పాఠ్యాంశాలు బోధించడానికి అవసరమైన లెక్చరర్లను మాత్రం నియమించలేదు. దీంతో హైస్కూల్‌కు చెందిన గణితం, సైన్స్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు ఇంటర్ విద్యార్థులకు బోధిస్తున్నారు. మరోవైపు విద్యార్థులకు ఫర్నీచర్ కూడా మంజూరు చేయలేదు. ల్యాబ్ సౌకర్యం కూడా లేదు. తరగతి గదులు కూడా చాలడం లేదు. ఈ విషయమై హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వై.హేమసుందర్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రస్తుతం హైస్కూల్ ఉపాధ్యాయులతోనే ఇంటర్ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్నట్టు తెలిపారు.


తరగతి గదిలో జూనియర్ కళాశాల విద్యార్థులు ఇలా..



సీతంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఏపీ టెట్ నోటిఫికేషన్

దిక్సూచి
DIKSUCHI

మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల విద్య విభాగం- 'ఆంధ్రప్రదేశ్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ పాఠశాలలు సహా ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, సంక్షేమ పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్/అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటోతరగతి నుంచి ఎనిమిదోతరగతి ఉపాధ్యాయుల ఎంపికకు టెట్ అర్హత తప్పనిసరి. రాష్ట్రంలో మెగా డీఎస్సీ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నోటిఫికేషన్ వెలువడింది.

టెట్ వివరాలు

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 1ఎ, 1బి, 2ఎ, 2బి అనే నాలుగు పేపర్లు ఉంటాయి. రెగ్యులర్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునేవారు 1ఎ పేపర్‌ను, ఆరోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు బోధించాలనుకునేవారు 2ఎ పేపర్‌ను రాయాలి. స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూళ్లలో ఒకటోతరగతి నుంచి అయిదో తరగతి వరకు బోధించాలనుకునేవారు 1బి పేపర్‌ను, ఆరోతరగతి నుంచి ఎనిమిదోతరగతి వరకు బోధించాలనుకునేవారు 2బి పేపర్‌ను రాయాలి. టెట్ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 60 శాతం మార్కులు; బీసీ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 40 శాతం మార్కులు రావాలి. రాష్ట్ర ప్రభు త్వం నిర్వహించే టీచర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఏపీ టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా టెట్ రాయవచ్చు. టెట్ స్కోర్ వ్యాలిడిటీ జీవితకాలం ఉం టుంది.
- ప్రతి పేపర్లో 150 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్, అభ్యర్థి ఎంచుకొన్న లాంగ్వేజ్‌లలో ఉంటుంది.
- 1ఎ పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్‌లాంగ్వేజ్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు అడుగుతారు.
- 1బి పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి-స్పెషల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ లాంగ్వేజ్, మేథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు.



- 2ఎ పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్ అంశాలు లేదా సోషల్ స్టడీస్ లేదా లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు.
- 2బి పేపర్లో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాగి-స్పెషల్ ఎడ్యుకేషన్, లాంగ్వేజ్-1, ఇంగ్లీష్ లాంగ్వేజ్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; డిజెబిలిటీ స్పెషలైజేషన్ అండ్ పెడగాగి నుంచి 60 ప్రశ్నలు ఇస్తారు.
- లాంగ్వేజ్-1 కింద తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్, కన్నడ, తమిళం, ఒడియా, సంస్కృతం భాషల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.750
- **ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 16
- **దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ:** జూలై 17
- **ఆన్‌లైన్ మాక్ టెస్ట్‌లు:** జూలై 16 నుంచి
- **హాల్ టికెట్ డౌన్‌లోడింగ్:** జూలై 25 నుంచి
- **ఏపీ టెట్ 2024 తేదీలు:** ఆగస్టు 5 నుంచి 20 వరకు
- **ప్రాథమిక 'కీ'ల విడుదల:** ఆగస్టు 10 నుంచి
- **'కీ'పై అభ్యంతరాల స్వీకరణ:** ఆగస్టు 11 నుంచి 21
- **ఫైనల్ కీ విడుదల:** ఆగస్టు 25
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 30
- **వెబ్‌సైట్:** http://cse.ap.gov.in

ఎవరు రాయొచ్చంటే..

- 1ఎ పేపర్ రాయాలంటే ఏపీ బీఐఈ నుంచి 50 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్'(డీఈఎల్ఈడీ)/నాలుగేళ్ల 'బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్'(బీఈఎల్ఈడీ)/రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్-స్పెషల్ ఎడ్యుకేషన్' పూర్తిచేసి ఉండాలి. ద్వితీయశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 1బి పేపర్ రాయాలంటే ఏపీ బీఐఈ నుంచి 50 శాతం మార్కులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల 'డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్'(డీఈడీ)-స్పెషల్ ఎడ్యుకేషన్' పూర్తిచేసి ఉండాలి. ఏడాది 'డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్'(డీఎస్ ఈ) ఉత్తీర్ణులు; 'డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్'(డీసీబీఆర్)/'డిప్లొమా ఇన్ మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్'(ఎంఆర్‌డబ్ల్యూ)/'డిప్లొమా ఇన్ హియరింగ్ లాంగ్వేజ్ అండ్ స్పీచ్'(డీహెచ్ఎల్ఎస్)/'డిప్లొమా ఇన్ ఒకేషనల్ రిహాబిలిటేషన్-మెంటల్ రిటార్డేషన్'(డీవీఆర్-ఎంఆర్)/'డిప్లొమా ఇన్ ఒకేషనల్ ట్రెయినింగ్ అండ్ ఎంప్లాయిమెంట్-మెంటల్ రిటార్డేషన్'(డీవీటీఈ-ఎంఆర్)/పీజీ డిప్లొమా ఇన్ కమ్యూనిటీ బేస్డ్ రిహాబిలిటేషన్(పీజీడీసీబీఆర్) ఉత్తీర్ణతతో పాటు ఆర్నెల్ల సర్టిఫికెట్ కోర్సు(ఎడ్యుకేషన్ ఆఫ్ చిల్డ్రన్-స్పెషల్ నీడ్స్) పూర్తిచేసినవారు; జూనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ డెఫ్ ఉత్తీర్ణులు; ప్రైమరీ లెవెల్ టీచర్ ట్రెయినింగ్ కోర్స్ ఇన్ విజువల్ ఇంపైర్‌మెంట్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 2ఎ పేపర్ రాయాలంటే డిగ్రీ/పీజీతోపాటు బీఈడీ పూర్తిచేసి ఉండాలి. ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు నాలుగేళ్ల బీఈఎల్ఈడీ ఉత్తీర్ణులు; ఏదేని డిగ్రీతోపాటు ఏడాది వ్యవధి గల బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) పూర్తిచేసినవారు; 55 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణతతోపాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ-ఎంఈడీ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- 2బి పేపర్ రాయాలంటే డిగ్రీ/పీజీతోపాటు బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తిచేసి ఉండాలి. బీఈడీ(జనరల్)తోపాటు ఏడాది డిప్లొమా-స్పెషల్ ఎడ్యుకేషన్/పీజీ డిప్లొమా-స్పెషల్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు; బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌తోపాటు పీజీ ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణులు; పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్-మెంటల్ రిటార్డేషన్ ఉత్తీర్ణులు; సెకండరీ లెవెల్ టీచర్ ట్రెయినింగ్ కోర్స్ ఇన్ విజువల్ ఇం పైర్‌మెంట్ పూర్తిచేసినవారు; సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ డెఫ్ ఉత్తీర్ణులు; బీఏ-బీఈడీ ఇన్ విజువల్ ఇంపైర్‌మెంట్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.
- లాంగ్వేజ్ టీచర్లు మాత్రం లాంగ్వేజ్ సబ్జెక్ట్‌లో డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజ్ పూర్తిచేసి ఉండాలి. డిగ్రీ ఇన్ లిటరేచర్; పీజీ(లాంగ్వేజ్ సబ్జెక్ట్)తోపాటు లాంగ్వేజ్ పండిట్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ ఉత్తీర్ణులు; బీఈడీ (లాంగ్వేజ్) పూర్తిచేసినవారు కూడా అర్హులే.

SCHOLARSHIP ALERT

Description: Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024 (formerly Rajiv Gandhi Scholarship) is an initiative of the Government of Rajasthan, for students planning to pursue undergraduate, postgraduate, Ph.D., and post-doctoral research programs abroad.

Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024

Eligibility: Applicants must be Indian citizens residing in Rajasthan, pursuing a UG, PG, Ph.D. or postdoctoral program, and be under 35 years old on July 1st of the financial year. Applicants must meet the specified income criteria to be eligible for the scholarship.

Prizes & Rewards: A monthly living expenses of up to 1,00,000 and other benefits

Last Date: 15-01-2025 *Application:* Online

Short Url: www.b4s.in/ aj/RGAE1

Kotak Junior Scholarship

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.



Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.

- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region (MMR).

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 15-07-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/KJSP2

TOEFL India Championship

Description: An initiative of ETS India Private Limited to help undergraduate students and working professionals pursue their dream of studying abroad.

Eligibility: Participants must currently be enrolled in the 3rd or 4th year of undergraduate studies at an accredited Indian higher education institution (college or university). Additionally, applicants who have completed their undergraduate or graduate studies in India and are seeking higher education abroad, or those with up to two years of verifiable professional work experience, are also eligible to apply.

Prizes & Rewards: Total prize money of 15 lacs

Last Date to Apply: 31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TOIC1


buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oYryGaKలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

15 రోజుల షూట్‌తో పూర్తి

'గేమ్ ఛేంజర్' చిత్రం మరో 15 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' రిలీజవ్వగానే పెండింగ్ పార్ట్‌ను పూర్తి చేస్తాను. 'గేమ్‌చేంజర్', 'భారతీయుడు' చిత్రాల మధ్య పోలిక లేదు. అవి రెండూ పూర్తిగా వేటికవే భిన్నమైనవి. సీక్వెల్ చేయడానికి అవసరమైన మలుపులు 'గేమ్ ఛేంజర్' కథలో లేవు కాబట్టి అలాంటి ప్రయత్నమేదీ చేయడం లేదు' అని దర్శకుడు శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన 'భారతీయుడు 2' చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శంకర్ మీడియాతో ముచ్చటించారు.





శంకర్

- 'భారతీయుడు' చిత్రానికి మూడో పార్ట్ కూడా ఉంది. మరో ఆరునెలల్లో దాన్ని కూడా విడుదల చేస్తాం. పలు రాష్ట్రాల్లో జరిగే కథ కావడంతో నిడివి పెరిగింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. ఎడిటింగ్‌లో ఒక్క సన్నివేశం కూడా తీసేయడానికి నా మనసు ఒప్పుకోలేదు. అందుకనే 'భారతీయుడు 3' ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం.
- భవిష్యత్‌లో జేమ్స్‌బాండ్ తరహా చిత్రాలు చేయాలనుకుంటున్నాను. అలాగే చారిత్రక, సైన్స్ ఫిక్షన్ కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉంది. వీఎఫ్ఎక్స్‌ను ఉపయోగించుకొని మంచి చిత్రాలు తెరకెక్కించే ఆలోచన ఉంది. ఆ సినిమాలు అందరినీ ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉంటాయి.
- శంకర్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేయాలనే ఆలోచన వచ్చింది. దాని గురించి నా స్నేహితులు, సహాయ దర్శకులు, కుటుంబ సభ్యులకు చెప్పినప్పుడు ఎవ్వరూ పెద్దగా ఎగ్జైట్ అవ్వలేదు. దాంతో ఆ ఆలోచన విరమించుకున్నాను. రజనీకాంత్, కమల్‌హాసన్‌తో మల్టీస్టారర్ ప్లాన్ చేశా. కానీ కమల్ హాసన్ బిజీగా ఉండడంతో కుదరలేదు.
- ఇప్పుడు సినిమాల్లో టెక్నాలజీ బాగా ఎక్కువైంది. దాంతో అద్భుతాలు సృష్టించవచ్చు. కానీ నా దృష్టిలో ఏఐ కన్నా మనిషి ఆలోచనలే శక్తిమంతమైనవి. ఇప్పుడే కాదు ఎప్పటికీ ఏఐ కన్నా మనిషి ఆలోచనలే ముందుంటాయి.
- తప్పకుండా షారూఖ్‌ఖాన్‌తో సినిమా చేస్తాను. మంచి స్ర్కిప్ట్ కుదరాలి. అట్లీ, లోకేశ్ కనగరాజ్ లాంటి దర్శకులు సృజనాత్మకంగా చిత్రాలను తెరకెక్కిస్తున్నారు. 'ట్వల్త్ ఫెయిల్' చిత్రం నాకు బాగా నచ్చింది.

అపరిచితుడు రీమేక్‌ను పక్కనపెట్టాం



రణ్‌వీర్‌సింగ్‌తో హిందీలో 'అపరిచితుడు' రీమేక్ చిత్రం లేనట్టే. ప్రస్తుతానికి ఆ చిత్రాన్ని పక్కనపెట్టినట్లు బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శంకర్ చెప్పారు. ఆ చిత్ర నిర్మాత జయంతిలాల్ గడ నాతో 'అపరిచితుడు' రీమేక్ కన్నా మరింత భారీ చిత్రం తీయాలనుకోవడమే దానికి కారణమని శంకర్ తెలిపారు. 'ఈ రీమేక్‌ను ప్రకటించాక కొత్త కాన్సెప్ట్‌లతో పలు పాన్ ఇండియా చిత్రాలు వచ్చాయి, మంచి విజయాన్ని అందుకొన్నాయి. దాంతో మా నిర్మాత మనసు మార్చుకున్నారు. ప్రస్తుతానికైతే 'అపరిచితుడు' రీమేక్‌ను పక్కనపెట్టినట్లే. చేతిలో ఉన్న సినిమాలు పూర్తి చేశాక దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం' అని శంకర్ చెప్పారు.

కష్టంతోనే అదృష్టం



మనం వంతు కష్టపడాలి, అప్పుడే అదృష్టం కూడా కలసి వస్తుంది అని నమ్ముతాను అన్నారు రష్మిక మందన్న. సినిమా జయాపజయాలపై తన ఆలోచనా ధోరణి గురించి చెబుతూ 'టీంలో ప్రతి ఒక్కరూ శ్రమిస్తేనే మంచి అవుట్ పుట్ వస్తుంది. అప్పుడే సినిమా పెద్ద హిట్ అవుతుంది. హీరో, హీరోయిన్ దర్శకుడు... ఇలా నటీనటులు మొదలుకొని ప్రతి టెక్నీషియన్ సినిమా కోసం ముందస్తుగా సన్నద్ధమయ్యేందుకు చాలా కష్టపడతారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎంత కష్టపడినా కొన్ని సార్లు అపజయం తప్పదు. అలాంటప్పుడు ఇంత కష్టపడినా ఇలా జరిగిందేంటి అని బాధపడకూడదు. కష్టాన్ని నమ్ముకొని ముందుకెళ్లాలి, అప్పుడే విజయాలు మన సొంతమవుతాయి' అని రష్మిక చెప్పారు. ప్రస్తుతం ఆమె తెలుగులో ధనుష్, నాగార్జున మల్టీస్టారర్ 'కుబేర'లో కథానాయికగా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక లుక్‌ను ఈ నెల 5న విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మా మధ్య అసూయ లేదు



తమిళ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్ వెండితెరపై కలసి నటిస్తే చూడాలని కోరుకోని అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. ఈ నెల 12న విడుదలవుతున్న 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో ఉన్న కమల్‌ను.. ఓ ఆంగ్ల మీడియా విలేఖరి 'ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత పాపులర్ నటులయిన మీ ఇద్దరూ కలసి నటించి ఎన్నో ఏళ్లు అవుతోంది. మళ్లీ మిమ్మల్ని ఒకే తెరపై చూసే అవకాశం ఉందా.. ఒకరి సినిమాల్లో ఒకరు కనిపించే ఆలోచనలు ఉన్నాయా?' అని ప్రశ్నించారు. దీనికి కమల్ సమాధానమిస్తూ 'మాది కొత్త కాంబినేషన్ అయితే కాదు. కెరీర్ కొత్తలో మేమిద్దరం ఎన్నో సినిమాల్లో కలసి నటించాం. ఆ సమయంలోనే ఇక కలసి ఒకే సినిమాలో కనిపించకూడదని నిర్ణయించుకున్నాం. మేం ఇద్దరం ఏ విషయంలో పోటీపడలేదు, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోలేదు. అప్పుడూ.. ఇప్పుడూ. ఎందుకంటే మేం ఇద్దరం ఒకే గురువు కె.బాలచందర్ దగ్గర శిక్షణ పొందాం. మా మధ్య అసూయకు తావు లేదు. ఒకరి ఎదుగుదలను ఇంకొకరం స్పోర్టివ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నాం. ఇదే మా మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. మాకు 20 ఏళ్లు ఉన్నప్పటి నుంచే ఇలాంటి అవగాహనతో కెరీర్‌లో ముందుకు సాగుతున్నాం' అని రజనీతో ఉన్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా, కమల్,రజనీ కలసి దాదాపు 16 చిత్రాల్లో నటించారు. ఆఖరిగా, 1985లో తెరకెక్కిన అమితాబ్ బచ్చన్ చిత్రం 'గిరఫ్తార్'లో స్ర్కీన్ షేర్ చేసుకున్నారు.



రాజ్‌తరుణ్ మాస్ హీరోగా నిలబడతాడు

ఇంతవరకూ వినోదభరితమైన పాత్రలతో అందరినీ నవ్వించిన యువ కథానాయకుడు రాజ్ తరుణ్ ఇప్పుడు పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రం 'తిరగబడరా సామీ' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మాల్వీ మల్హోత్రా కథానాయికగా నటించారు. ఎ.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'అందరం ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. ముఖ్యంగా డీవోపీ జవహర్‌రెడ్డి అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. సినిమాలో ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. అయినా దర్శకుడి ప్రోత్సాహంతో ఈజీగా చేశాను. ఇందులో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా బాగుంటాయి. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన నిర్మాత శివకుమార్‌కు నా ధన్యవాదాలు' అని చెప్పారు. 'నేను దర్శకత్వం వహించిన 'యజ్ఞం' చిత్రం ఇదే రోజున విడుదలై నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. అదే ఈ రోజున 'తిరగబడరా సామీ' ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. రాజ్‌తరుణ్ ఈ సినిమాతో మాస్ హీరోగా నిలబడతాడు. నిర్మాత చాలా గ్రాండ్‌గా సినిమాని తీశారు. అందరినీ ఆకట్టుకొనే చిత్రమిది' అని చెప్పారు రవికుమార్. 'ఇందులో బాలకృష్ణ అభిమానిగా నటించా. చాలా బ్యూటిఫుల్ కథ ఇది. సినిమాలో ఓ ఫైట్ కూడా చేశా. ఈ చిత్రంతో తెలుగులో పరిచయం కావడం ఆనందంగా ఉంది' అన్నారు హీరోయిన్ మాల్వి. నిర్మాత శివకుమార్ మాట్లాడుతూ 'రవికుమార్ చెప్పిన కథ బాగా నచ్చింది. ఇందులో రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తే బాగుంటుందని ఆయన్ని అడిగితే వెంటనే అంగీకరించారు. యాక్షన్ పాత్రలో ఆయన కొత్తగా కనిపిస్తారు. ప్రతి సినిమాతో నేను కొత్తవారిని పరిచయం చేస్తుంటాను. ఈ సినిమాతో హీరోయిన్ మాల్వి పరిచయమవుతోంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zzc1i8G లో చదవండి.

విరాజి టైటిల్‌తో వరుణ్ సందేశ్




ఇటీవలే విడుదలైన 'నింద' చిత్రంతో హీరోగా చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. త్వరలో తన కొత్త చిత్రం 'విరాజి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎమ్ 3 మీడియా బేనర్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం టైటిల్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'నింద' సక్సెస్ నాకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. హర్ష చెప్పిన కథ బాగా నచ్చింది. ఆయనకు మంచి భవిష్యత్ ఉంది. నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ ఇది. ఇందులో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'త్వరలో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం. 'విరాజి' వరుణ్ సందేశ్‌కు పేరు తెస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "విరాజి' చిత్రంలో వరుణ్ సందేశ్‌ను కొత్త అవతారంలో చూపించబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఆగస్టు 2న విడుదల చేయాలనుకుంటున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎబినేజర్ పాల్, సినిమాటోగ్రఫీ: జీవీ అజయ్‌కుమార్, ఎడిటర్: రామ్ తూము

భారతీయ సినిమాకు అవార్డుల పంట

సుచి తలాటి దర్శకత్వంలో బాలీవుడ్ నటి రిచా చద్దా, ఫయాజ్ అలీ నిర్మించిన 'గర్ల్స్ విల్ బి గర్ల్స్' చిత్రం రిలీజ్‌కు ముందే సంచలనాలు సృష్టిస్తోంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం ఇప్పుడు మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజెల్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ జ్యూరీ అవార్డును సాధించి చరిత్ర సృష్టించింది. ఈ సినిమా ఇప్పటికే రొమేనియాలోని ట్రాన్సిల్వేనియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లోని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ గ్రాండ్ జ్యూరీ అవార్డులను కైవసం చేసుకుంది. ఇలా వరుసగా మూడు గ్రాండ్ జ్యూరీ అవార్డులు సాధించి హ్యాట్రిక్ సాధించింది. ఈ సందర్భంగా నిర్మాతలు రిచా చద్దా, ఫయాజ్ అలీ మాట్లాడుతూ 'ఇలా ఒక నెలలోనే ఈ సినిమాకు మూడు గ్రాండ్ జ్యూరీ పురస్కారాలు దక్కడంతో చాలా ఆనందంగా ఉంది. ఇది మా కష్టానికి దక్కిన గౌరవం. మా హృదయాలకు చేరువైన ఈ సినిమా.. ఇంతటి ఘనమైన ప్రదర్శన చేస్తుండడం జీవితాంతం మర్చిపోలేని విషయం. ఒక నిర్మాతగా మొదటి సినిమాకే ఇంత ఖ్యాతి రావడం మా అదృష్టం' అని చెప్పారు. కాగా, 16 ఏళ్ల అమ్మాయి జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రీతి పాణిగ్రహి ప్రధాన పాత్రలో నటించారు.



షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం లభించింది. స్విట్జర్లాండ్‌లోని లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించే అక్కడి జ్యూరీ సభ్యులు.. షారుక్ ఖాన్‌ను ఈ ఏడాది జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో సత్కరించనున్నారు. షారుక్‌కు 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రకటించింది. అంతే కాకుండా.. ఆయన సినిమాల్లో క్లాసికల్ హిట్‌గా మిగిలిన 'దేవదాసు' సినిమాను కూడా ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్ర్కీనింగ్‌కు ఎంపిక చేసింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శత్వంలో 2003లో రిలీజైన ఈ సినిమా విమర్శకులు ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ అవార్డుకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో ప్రకటించిన ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు.. షారుక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. 'షారుక్ లాంటి దిగ్గజ నటుడ్ని మా ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆహ్వానించాలనే కోరిక ఈ 77వ ఎడిషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో తీరింది. నిర్మాతగా, నటుడిగా భారతీయ సినిమా ఇండస్ట్రీపై తనదైన ముద్ర వేసిన ఆయన్ని సత్కరించడం మా గౌరవం'. కాగా, ఈ ఫిల్మ్ ఫెస్టివల్ స్విట్జర్లాండ్‌లో వచ్చే నెల 7 నుంచి 17వ తేదీ వరకు జరుగుతుంది. ఈ అవార్డును షారుక్ ఆగస్టు 10న అందుకోనున్నారు.


జలవనరులశాఖ భూములు అన్యాక్రాంతం

● వైసీపీ పాలనలో అందినకాడికి ఆక్రమణలు ● చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న సంబంధితశాఖ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని తాటిపూడి రిజర్వాయర్‌ను ఆనుకుని సుమారు 50 నుంచి 90 ఎకరాల వరకు జలవనరులశాఖకు చెందిన ప్రభుత్వ భూమి ఉంది. ఇప్పుడు దీనివిలువ సుమారు వంద కోట్ల పైమాటే. అయితే గడిచిన ఐదేళ్ల కాలంలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్ల కొంతమంది వైసీపీ మద్దతుదారులు కొన్ని చోట్ల సంబంధిత భూముల్లో నిర్మాణాలు చేయగా మరికొన్ని చోట్ల ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఇది ఆ శాఖ ఉన్నత స్థాయి అధికారినుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకూ తెలిసిన చూసీ చూడనట్లు వ్యవహరించడం విశేషం.

ఇందులో మరో విశేషం ఏంటంటే జలవనరులశాఖ నుంచి వచ్చే కరెంటు.. నీటిని సైతం అక్రమార్కులు వదిలిపెట్టకుండా యథేచ్ఛగా వాడుకోవడంతో పాటు అమ్ముకోవడం జరుగుతోంది. అయినా ఎవ్వరూ ఏమీ అనకపోవడం మరో విశేషం. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ భూముల్లో పర్యాటక కేంద్రం ఏర్పాటుచేసి ప్రభుత్వానికి ఆదాయంతో పాటు సుమారు 200మందికి పైగా ఉపాధి కల్పించే ప్రణాళిక రూపొందించింది. అయితే ఇది కార్యరూపం దాల్చకముందే ఎన్నికల హడావిడి మొదలుకావడంతో ఈ పనులు కార్యరూపం దాల్చలేదు. ఈ జలవనరులశాఖ భూముల్లో కోట్లు విలువచేసే గ్రావెల్ నిల్వలు ఉన్నాయి. దీంతో దీనిని గడిచిన ఐదేళ్లుగా ఈ పంచాయతీకి చెందిన వైసీపీ ప్రజాప్రతినిధులు, సంబంధిత పార్టీ నాయకులు పెద్దఎత్తున గ్రావెల్ వ్యాపారం చేసి కోట్లు సంపాదించారన్నది ఈప్రాంతవాసులతో పాటు సంబంధిత అధికారులకూ తెలిసిన విషయమే. అయితే అధికారులు మాత్రం అధికారపార్టీ నేతలంటే భయంతో మౌనం దాల్చారు. ఈ భూముల్లో ఉన్న గ్రావెల్‌ను చోటా నేతలు దోచుకుపోవడం చూసిన జిల్లా పెద్దనేత తమకు సంబంధించిన వారి లేఅవుట్లకు లెక్కకు మించి గ్రావెల్‌ను తరలించి భూములు కప్పుకుని, దీనిద్వారా సర్వాంగ సుందరంగా భూమిని చదునుచేసి లేఅవుట్‌వేసి లక్షల రూపాయలకు ప్లాట్‌లు అమ్ముకుంటున్నారు. ఈ విషయం అప్పట్లో ఆంధ్రజ్యోతి వరుస కథనాలు ప్రచురించడంతో మైనింగ్‌శాఖ అధికారులు వచ్చి సదరు భూములను తవ్విన కొండలను, చెరువులను చూసి కొలతలు వేసి వెళ్లారు తప్ప వారిపై ఎటువంటి చర్యలు లేవు. గడిచిన ఐదేళ్లలో ఈ జలవనరుల శాఖ భూములను తమ సొంత జాగీరులా వాడుకున్నారు.

ఈశాఖకు ఎంతభూమి ఉందో సంబంధిత అధికారులను అడుగుదామని ఫోన్‌చేసిన ప్రతిసారి వారు స్పందించకపోవడం విశేషం. ప్రస్తుతం తాటిపూడి రిజార్వాయర్‌ను ఆనుకుని ఉన్న జలవనరుల శాఖ భూముల్లో నిర్మాణాలు, ఆక్రమణలు తొలగించి పర్యాటక హంగు కల్పిస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు యువతకు ఉపాధి దొరుకుతుంది.



గ్రావెల్ తవ్వుకుపోయిన దృశ్యం



జలవనరులశాఖ భూమి ఆక్రమించి కొంతమంది వేసిన గేట్లు

ఇంకా జగన్ బొమ్మలేనా..?

● ప్రభుత్వం మారినా పట్టని అధికారులు

జామి, జూలై 2: ప్రభుత్వం మారినా కొన్నిశాఖల అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండలంలోని చింతాడ టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ తమ గ్రామంలో రేషన్ పంపిణీ చేసే వ్యాన్‌పై ఇంకా మాజీ ముఖ్యమంత్రి బొమ్మ పెట్టుకుని దర్జాగా ఇస్తున్నారని, ఇది చూసిన వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు చాలా అహంకారంగా మాట్లాడుతున్నారన్నారు. మీ ప్రభుత్వం వచ్చినా ఇంకా తమ నాయకుడి బొమ్మ ఉంటేనే పనులు జరుగుతున్నాయని హేళన చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారాక పౌరసరఫరాల శాఖ ఈ బొమ్మపై కాగితం కప్పి ఉంచాల్సిఉన్నా అది తీయించేసి ఇలా రేషన్ పంపిణీ చేయించడం సరికాదన్నారు. వెంటనే వ్యాన్‌పై వున్న బొమ్మను తొలగించాలని కోరారు. ఇదే విషయంపై తహసీల్దార్ రాంబాయ్ వివరణ కోరగా బొమ్మలు తొలగించాలని తమకు ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదని, ఎన్నికల కోడ్ తొలగిన కారణంగా వ్యాన్‌పై బొమ్మ ఉండిపోయిందని తెలిపారు.



చింతాడలో రేషన్‌బియ్యం వాహనంపై మాజీ సీఎం జగన్ బొమ్మ ఉంచి రేషన్ ఇస్తున్న దృశ్యం

పోస్టాఫీసులో విచారణ

వంగర: బాగెమ్మపేట పోస్టు మాస్టర్ విధులకు డుమ్మా కొడుతున్నట్టు గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు బృందం మంగళవారం బీపీఎంను రప్పించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టారు. రికార్డుల నిర్వహణ, ఆర్డీల చెల్లింపు, తదితర విషయాలు పరిశీలించారు. ఉన్నతాధికారులకు విచారణ నివేదికను అందజేయనున్నట్లు దర్యాప్తు అధికారి అప్పలనాయుడు బృందం తెలిపారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

రాజాం: స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం బీజేపీ నేతలు అమ్మ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వాటి రక్షణ బాధ్యతలను కూడా తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, పార్టీ విస్తారక్ వేమకోటి గిరిబాబు, జిల్లా కార్యదర్శి సామంతు రమణనాయుడు, పట్టణ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్, గుడివాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

5న అప్రంటిస్ మేళా

రాజాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మెడో సర్వో వారి ఆధ్వర్యంలో ఈ నెల 5న అప్రంటిస్ మేళా నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఎలక్ట్రీషియన్ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రానిక్ మెకానిక్‌తో పాటు పదో తరగతిలో 58 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 8309439446, 9000096048 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

తైక్వాండోలో ప్రతిభ

విజయనగరం దాసన్నపేట: విశాఖపట్టణంలో గత నెల 30 నుంచి రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులకు 4 బంగారు, 2 రజత, 5 కాంస్య పతకాలు లభించాయి. నలుగురు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పరాంకుశం చైతన్య, ఆర్.సృజన్, ఎ.దీక్షశ్రీ, వీఎస్ఆర్ షన్ముణ్, అభినాష్ బంగారు పతకాలు సాధించారు. డి.అభిశ్రీ, జి.హర్షిణి రజత పతకాలు సాధించారు. వ ఈరిని డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు అభినందించారు.

పింఛన్ల పంపిణీలో అధికారుల చొరవ భేష్

విజయనగరం(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధకారులు చూపిన శ్రద్ధ, చొరవ వల్ల జిల్లా ప్రతిష్ఠ పెరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు అన్నారు. మొదటి రోజే 96.98 శాతం పూర్తి చేసి రికార్డు సృష్టించారని కొనియాడారు. ఎన్నికలకు ముందు పింఛన్ల పంపిణీ విషయంలో వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు అనేక ఇబ్బందులకు గురిచేసిందని, కానీ టీడీపీ ప్రభుత్వం జిల్లాలోని 2.82 లక్షల లబ్ధిదార్లకు రూ.118 కోట్లు పంపిణీ చేసిందన్నారు. కలెక్టర్ నుంచి సచివాలయ ఉద్యోగుల వరకు పింఛన్ల పంపిణీలో అనుక్షణం చూపిన ప్రత్యేక శ్రద్ధ ఫలితమే రాష్ట్రంలో మన జిల్లా ప్రథమస్థానం దక్కించుకుందని వెల్లడించారు. అధికార యంత్రాంగానికి మరోసారి అభినందనలు తెలిపారు.

జాబ్‌మేళాకు 79 మంది హాజరు

రాజాం: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాకు 79 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు తెలిపారు. వీరిలో 29 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల హెచ్‌ఆర్ మేనేజర్లు, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

రాజాం: స్థానిక వికాసతరంగిణి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. యోగా గురువు టీటీవీ రమణమూర్తి 10 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.

జూనియల్ కాలేజీలో సీట్లు ఖాళీ

బాడంగి: బాడంగి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 4 గ్రూపులకు సంబంధించి 56 సీట్లుఖాళీగా ఉన్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ్‌కుమారి ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీలకు సంబంధించి 160 సీట్లకు గానూ ఇప్పటివరకు 104 మంది మాత్రమే చేరినట్టు తెలిపారు. ఇంకా ఎవరైనా ఇంటర్ మొదటి ఏడాదిలో చేరాలనుకుంటే సంప్రదించాలన్నారు.

నేడు విద్యాకానుక కిట్లు పంపిణీ

బాడంగి: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే.రంగారావు పాల్గొంటారని టీడీపీ ఎంపీటీసీ సభ్యులు దేవరాపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే చేతులమీదుగా విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు హాజరుకానున్నారని తెలిపారు.

ఉత్తమ రైతులకు సత్కారం

శృంగవరపుకోట: మండల కేంద్రమైన ఎస్.కోట ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఇద్దరు ఉత్తమరైతులకు సత్కారంచేశారు. ఈ సందర్భంగా డిపోమేనేజర్ మట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే రైతులను సత్కరించాలనే ఉద్దేశ్యంలో బాగంగా ఈకార్యక్రమం చేశామన్నారు. రైతులు రెడ్డి వెంకటరావు,సిరిపురపు సన్యాసినాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా తమకు వెలకట్టలేని ఆనందం కల్గిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఏడీసీ అల్లు గిరి, సత్యనారాయణ, పైడితల్లి తదితరులు ఉన్నారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి

కలెక్టరేట్: జిల్లాలో పశువులు అక్రమ రవాణాను అరికట్టాలని ఏపీ గో సంరక్షణ సమైక్య నాయకులు లోగిశ రామకృష్ణ మంగళవారం కలెక్టరు అంబేడ్కర్‌ను కోరారు. మండల, జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలోని సంఘ నాయకులు చోళ్ళ రాజకుమారి, సీలాపు దేవి, మద్దిల సోంబాబు తదితరులు ఉన్నారు.

తాటిపూడిని అభివృద్ధి చేస్తాం

● శివారు ఆయకట్టుకూ నీరందిస్తాం

● రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేసిన మంత్రి శ్రీనివాస్

గంట్యాడ, జూలై 2: గత పాలకుల తప్పిదాలతో తాటిపూడి రిజర్వాయర్ అభివృద్ధికి దూరమైందని, ఇక్కడి సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని రాష్ట్ర చిన్న తరహా, ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ప్రజల జీవితాల్లో సంతోషం నింపడమే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని అన్నారు. తాటిపూటి రిజర్వాయర్ నుంచి సాగునీటిని మంగళవారం ఆయన విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రిజర్వాయర్ పరిధిలోని కాలువల్లో కొన్నిచోట్ల పూడిక ఉందని, వాటిని తొలగిస్తామన్నారు. శివారు ఆయకట్టు వరకూ సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంఎన్ ఛానల్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖపట్నం తాగునీటి అవసరాలు తీరుస్తున్న ఈ రిజర్వాయర్ అభివృద్ధికి విశాఖపట్టణం కార్పొరేషన్ నుంచి రావాల్సిన నిధుల కోసం కూడా ప్రయత్నం చేస్తున్నామన్నారు. పూర్తి భద్రతా ప్రమాణాలతో బోటు షికారును పునరుద్ధరించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.

● కలెక్టర్ అంబేడ్కర్ మాట్లాడుతూ వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ గొర్రిపాటి బుచ్చి అప్పారావు కృషితో విశాఖకు తాగునీరు, ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు గోస్తనీ నదిపై నిర్మించిన తాటిపూడి రిజర్వాయర్ జీవనాడి లాంటిదని చెప్పారు. టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షుడు కిమిడి నాగార్జున మాట్లాడారు. అంతకుముందు ఆయకట్టు రైతులు వివిధ సమస్యలపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. కాలువల్లో పూడిక తీయాలని, గేట్లకు మరమ్మతులు చేయించాలని, రిజర్వాయర్ వద్ద సిబ్బందిని నియమించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డీవో సూర్యకళ, ఇరిగేషన్ ఈఈ సీతారామనాయుడు, డీఈ గోవిందరావు, జేఈ తమ్మినాయుడు, తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, ఎంపీడీవో భవాని, మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సాగునీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే ఆరోగ్యం

● సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన ప్రారంభించిన జేసీ కార్తీక్

కలెక్టరేట్, జూలై 2: ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సి ఉందని జేసీ కార్తీక్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ, ఆరోగ్యం కోసం ఈ ఉత్పత్తులనే వినియోగించాలని పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని కోరారు. కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తుల ప్రదర్శన విక్రయాలను జేసీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతు శాస్త్ర వేత్తలు, మెంటార్‌లు, ఏటీఎం, ఏ1 విధానాల ద్వారా పండించిన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను తిలకించి ఆయా వ్యవసాయోత్పత్తుల పంట దిగుబడి, వాటి ద్వారా లభిస్తున్న ఆదాయం, వాటి మార్కెటింగ్ అంశాలపై రైతులతో, వ్యవసాయ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం కోసం ఏదైనా వేదికను ఏర్పాటు చేయడం అవసరమని జేసీ సూచించారు. వ్యవసాయ శాఖ జేడీ రామారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం డీడీలు ఆనంద్ ప్రకాష్, హేమసుందర్ ఉన్నారు.



ప్రదర్శన ప్రారంభిస్తున్న జేసీ కార్తీక్

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

విజయనగరం క్రైం: మాదక ద్రవ్యాల వినియోగంతో యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని విజయనగరం రూరల్ ఎస్ఐ వాసుదేవ్ అన్నారు. మంగళవారం రూరల్ బీసీ కాలనీ ఐటీఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడితే, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ వాసుదేవ్

సమష్టి కృషితోనే అభివృద్ధి: అదితి

విజయనగరం రింగురోడ్డు: సమష్టి కృషితోనే రాష్ట్రాన్ని, జిల్లాను అభివృద్ధి పరుచుకుందామని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతిరాజు అన్నారు. మంగళవారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అదితికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి పార్టీకి ఇంతటి ఘన విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రిలాగే తాను కూడా ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ కామర్స్ ప్రతినిధులు రవ్వా శ్రీనివాస్, కాపుగంటి ప్రకాష్, ఉసిరకల చంద్రశేఖర్, శివకుమార్, ముచ్చి రామలింగస్వామి, వల్లంపాటి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అదితిని సత్కరిస్తున్న దృశ్యం

రాజుల చెరువు హద్దుల కొలతలు

శృంగవరపుకోట, జూలై 2: మండల కేంద్రం శృంగవరపుకోటలో ఉన్న రాజులచెరువు ఆక్రమణలకు గురైందని గతంలో ఆయకట్టుదారులు చేసిన ఫిర్యాదుపై మంగళవారం జిల్లా కేంద్రం నుంచి అధికారులు, సిబ్బంది వచ్చి సర్వే చేశారు. ఆర్‌డీవో కార్యాలయం నుంచి సర్వే ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్ రాగా స్థానిక సర్వేయర్ వెంకటరావు, వీఆర్‌వో రమణ, ఆయకట్టు దారుల ఆధ్వర్యంలో సర్వే చేసి హద్దులు చూశారు. ఈవిషయంపై ఆయకట్టు సంఘ నాయకుడు నానిగిరి రమణాజీ చిప్పాడ రమణ, ఈశ్వరమ్మ, కొటాన రాము, రమణమ్మ, పొట్నూరు రమణ, దామోదర శ్రీను, వసంత సత్యారావు మాట్లాడుతూ తమ ఫిర్యాదుపై జిల్లా అధికారులు స్పందించడం ఆనందంగా ఉందన్నారు. సర్వేఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఆయుకట్టుదారులు, భూమి యాజమానులు ఆధ్వర్యంలో హద్దుల నిర్ధారణ చేశామని చెప్పారు.



చెరువులో సర్వే చేస్తున్న దృశ్యం

పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు

విజయనగరం రూరల్: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5.45 గంటలకు సుప్రభాత సేవ అనంతరం, 6.30 గంటల నుంచి భక్తులకు దర్శనంను కల్పించారు. మంగళవారం అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన రోజు కావడంతో వివిధ రకాల పువ్వులతో అలంకరించారు. ఆలయ ఈవో ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడుకొండలు, ఆలయ అర్చకులు, సిబ్బంది కూడా పైడిమాంబకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అలంకరణలో అమ్మవారు

నేడు వేలంపాట/ టెండర్స్

పైడిమాంబ వనంగుడి (రైల్వే స్టేషన్ రోడ్డు)లో వున్న 100 గజాల స్థలం, అదే విధంగా కెఎల్‌పురంలో 300 గజాల స్థలాన్ని అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు దేవదాయశాఖ నిర్ణయించింది.. ఈ మేరకు బుధవారం వనంగుడి వద్ద వేలం/టెండర్ (ఏదీ ఎక్కువ ధర) అయితే దానికి నిర్ణయించి టెండర్లు పిలవనున్నారు.. మంగళవారం నాటికి ఈ రెండు స్థలాలకు సంబంధించి 11 మంది టెండర్ దాఖలు చేశారు.. ఆలయ ఈఓ డి ప్రసాదరావు ఆధ్వర్యంలో దేవదాయశాఖ ఉన్నతాధికారులు ఈ ప్రక్రియను నిర్వహించనున్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం: కోండ్రు

రాజాం: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మంగళవారం వాసవీ నగర్‌లో సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కనీసం రోడ్డు మరమ్మతులు కూడా చేపట్టలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పొట్నూరు సోమశేఖర్, మక్కా అప్పలనాయుడు, టంకాల దిలీప్, శ్రీను, చిరంజీవి, టంకాల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న కోండ్రు

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. వీటి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

అధికారులు శ్రద్ధగా పనిచేయాలి: కోండ్రు

రేగిడి: టీడీపీ ప్రభుత్వంలో అధికార్లు అకౌంట్‌బులిటితో పనిచేసి ప్రజాసమస్యలు సత్వర పరిష్కారానికి చొరవచూపాలని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి అన్నారు. స్థానిక మండలపరిషత్ ప్రాంగణంలో మంగళవారం కోండ్రు ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. 39 పంచాయతీలనుంచి ఆయా గ్రామస్థులు, టీడీపీ క్యాడర్ పెద్దఎత్తున ప్రజాసమస్యలపై ఫిర్యాదుచేశారు. తమ ప్రభుత్వం హయంలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తీసుకువెళ్లి నవ్యాంధ్ర అభివృద్ధికి కృషిచేస్తామని, ఇందుకు అధికార్లు, సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ● ఎమ్మెల్యేగా ఎన్నికై తొలిసారిగా రేగిడి వచ్చిన కోండ్రుకు రాజకీయనేతలు, ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ రాములమ్మ ఇంకా పలుశాఖలవారీగా, వివిధస్థాయి అధికార్లు, సిబ్బంది ఘన సత్కారం నిర్వహించారు.

కోండ్రుకు ఘన సత్కారం

రాజాం: కోండ్రు మురళీమోహన్‌కు మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక సూర్యదుర్గ కల్యాణ మండపంలో ఉద్యోగ ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి సత్కరించారు. అనంతరం కోండ్రు మురళీమోహన్ మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని, టీడీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగులు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు అవమానాలకు గురయ్యారని, వారి గౌరవాన్ని కాపాడేందుకు తగు చర్యలు చేపట్టేందుకు చంద్రబాబు కృషి చేస్తారన్నారు.

రోజూ రిజర్వాయర్ల తనిఖీ

బొబ్బిలి, జూలై 2: బొబ్బిలి ఆర్‌డబ్ల్యుఎస్ పరిధిలోని ఐదు మండలాల్లో రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులను రోజువారీ తనిఖీ చేయనున్నట్టు డీఈఈ పీఎంకే రెడ్డి తెలిపారు. బొబ్బిలి మండలం మెట్టవలస, పారాది గ్రామాలలో మంగళవారం ఆయన తాగునీటి వ్యవస్థ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ రెండేసి గ్రామాలలో పర్యటించి తాగునీటిని పరిశీలిస్తున్నామన్నారు. క్లోరినేషన్ చేయిస్తున్నామన్నారు. తక్కువ మొత్తంలో మరమ్మతులు ఉంటే పంచాయితీల నిధుల నుంచి చేపడతారని, హెచ్చుమొత్తంలో అవసరమైతే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. తెర్లాం మండలంలో అప్పలమ్మపేట, కోల్లివలస, ఉద్దవోలు తదితర గ్రామాలలో ఆరు తాగునీటి పథకాల మరమ్మతులకు రూ.ఆరు లక్షలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, దత్తిరాజేరు మండలాల్లో నెలకు 300 చొప్పున తాగునీటి శాంపిల్స్‌ను పరీక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జేఈ శ్రావణ్ కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.



మెట్టవలసలో తాగునీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డీఈఈ, ఇతర అధికారులు

స్వాధీనం చేసుకున్న అక్రమ మద్యం ధ్వంసం

శృంగవరపుకోట: ఇటీవల కాలంలో తమ దాడులలో పట్టుకున్న అక్రమ మద్యంతో పాటు నాటుసారాను ఎస్.కోట సెబ్‌స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేసినట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ తెలిపారు. మంగళవారం ఎస్ఈబీ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరెండెంట్ బీవీజీ రాజు ఆధ్వర్యంలో 70కేసులు మద్యంతో పాటు నాటుసారా ధ్వంసంచేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఫణీంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.



మద్యంబాటిళ్ల ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జామి: జామి సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్రబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం గుర్లదెప్పు నుంచి ఇసుకను అక్రమంగా తేవడం గుర్తించి దాడిచేసి పట్టుకున్నామన్నారు. అనంతరం జామి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు.

ఆసుపత్రిలో ఉన్న రోగులకు పింఛన్ అందజేత

రేగిడి, జూలై 2: ఎన్‌టీఆర్ భరోసా కింద ఇస్తున్న పింఛన్లు ఇంటివద్ద అందజేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఇద్దరు సచివాలయ సిబ్బంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పింఛన్ నగదు అందజేశారు. మజ్జిరాముని పేటకు చెందిన కొమ్ము ఎరుకనాయుడు, అంబఖండికి చెందిన పుర్లి వెంకట రమణకు వృద్ధాప్య పింఛన్లు ఉండగా, వీరు ఇటీవల అనారోగ్యం బారినపడి శ్రీకాకుళం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. దీంతో ఈ గ్రామాల సచివాలయ సిబ్బంది శ్రీకాకుళం వెళ్లి పింఛన్ నగదు రూ. 7వేలు చొప్పన అందించారు.



మజ్జిరామునిపేట వృద్ధుడికి శ్రీకాకుళం ఆసుపత్రిలో పింఛన్ అందిస్తున్న దృశ్యం

విపత్తులపై విద్యార్థులకు అవగాహన

విజయనగరం రూరల్: విపత్తులు వస్తే ఏ విధంగా ఎదుర్కోవాలన్న అంశంపై విద్యార్థినీ, విద్యార్థులకు ఎన్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందం నగరంలోని వీటి అగ్రహారం స్కూల్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌డీఆర్ఎఫ్ ఎస్ఐ సంతోష్‌కుమార్ బెహరా మాట్లాడుతూ, విపత్తులు సంభవించే సమయంలో ధైర్యంగా ఉండి ఆపదలో ఉన్న వారిని రక్షించాలన్నారు. ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ బి సంజీవ్‌కుమార్, వీటి అగ్రహారం స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్‌గారు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తం

కొత్తవలస: మండలంలో ఎవరికీ ఆరోగ్య సమస్యలు రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రమణయ్య తెలిపారు. మంగళవారం మండల అధికారులతో టాస్క్‌ఫోర్సు సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, తహసీల్దార్ చంద్రశేఖర్, వైద్యాధికారులు సీతల్ వర్మ, గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ ధర్మారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం చేయాలి

బొబ్బిలి: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 4న తలపెట్టిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రవణ్‌కుమార్, వి.భరత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు మణి పిలుపునిచ్చారు. స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో మంగళవారం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు క్రేంద ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, ఈ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలన్న డిమాండ్లతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించనున్నామని వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో గల అన్ని విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ పాటించి సహకరించాలని వారు కోరారు.

నేడు రాజాంలో ప్రజాదర్బార్

రాజాం: రాజాం పురపాలక సంఘం పరిధిలోని 24 వార్డులకు సంబంధించి ప్రజల సమస్యలపై బుధవారం సాయంకాలం 4 గంటల నుండి 6 గంటల వరకు శ్యాంపురం క్యాంపుకార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నామని కోండ్రు ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలను విడివిడిగా ఒక్కొక్క పేపరుపై రాసి తీసుకురావాలన్నారు.

టోల్ ప్లాజాల వద్ద మినహాయింపు ఇవ్వాలి

విజయనగరం: ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులకు టోల్‌ప్లాజాల వద్ద టోల్ చార్జీని మినహాయింపు ఇవ్వాలని కేంద్ర హైవే రోడ్లు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీని ఎంపీ కలిశెట్టి కోరారు. మంగళవారం డిల్లీలో ఆయన కార్యాలయానికి వెళ్లిన కలిశెట్టి కేంద్ర మంత్రికి వినతిపత్రం అందించారు. సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈ అవకాశం కల్పించాలని కోరారు.

ఉపాధి వేతనాలు చెల్లించండి



ధర్నా నిర్వహిస్తున్న వేతనదారులు

మక్కువ: పెండింగ్‌లో ఉన్న ఉపాధి వేతనదారుల బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద వేతనదారులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు పూటలా పనులు రద్దు చేయాలన్నారు. వేతనదారులకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. గత ఐదు వారాల నుంచి బిల్లులు చేయకపోవడంతో వేతనదారులు అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పని ప్రదేశాల్లో టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. వేతనదారులకు రూ.400 గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవో పి.దేవకుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్ర మంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు టి.ప్రభాకర్, వెంకటరావు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

సాలూరు రూరల్: స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. మామిడిపల్లిలో మంగళవారం ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యలపై ఈనెల 10న డిమాండ్ డే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ సమస్యలపై నిర్లక్ష్యం వీడి, వారి శ్రేయస్సు కోసం సరిపడే బడ్జెట్ ప్రకటించాలని కోరారు. నూతన పింఛన్ విధానం రద్దు చేసి, పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 10న జరిగే డిమాండ్ డేలో అన్ని వర్గాలు పాల్గొనాలని ఆయన కోరారు. ఈసందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరి, శ్రీదేవి, లక్ష్మి, ఆదిలక్ష్మి, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

బోధన సులభతరంగా ఉండాలి

● రైతు సాధికారిక సంస్థ సీనియర్ కన్సల్టెంట్ పారినాయుడు

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సులభతరంగా ఉండేలా బోధన నిర్వహించాలని రాష్ట్ర సాధికారిక సంస్థ కన్సల్టెంట్ డా.డి.పారినాయుడు సూచించారు. మంగళవారం తోటపల్లి నూతన జట్టు ట్రస్ట్ భవనంలో రచయితలతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి నుంచి పొలంబడికి సంబంధించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ పి.షణ్ముఖరాజు, రచయితలు ఆర్.వాసుదేవరావు, టి.శివకేశవరావు, బి.భీమేశ్వరరావు, ఉమా మహేశ్వరరావు, ఎం.నూకంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనులు ప్రారంభం

● డీఈవో పగడాలమ్మ



విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న డీఈవో

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని 535 పాఠశాలల్లో అభివృద్ధి పనులు ప్రారంభించినట్టు డీఈవో జి.పగడాలమ్మ తెలిపారు. మంగళవారం ఆమె గుమ్మలక్ష్మీపురం పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. నాడు-నేడు పథకంలో భాగంగా 535 పాఠశాలలకు నిధులు వచ్చాయని, త్వరలో పనుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలో మన్యం జిల్లాలో ఖాళీగా ఉన్న మండల విద్యాశా ఖాధికారుల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే 15 మండలాల్లో విద్యార్థులకు విద్యా కిట్లు అందించామని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఆమె వెంట మండల విద్యాశాఖాధికారి బి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అడ్డాకుల సన్యాసినాయుడు, ఆర్.వి.రమణ, ఆర్.శంకరరావు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మంగళవారం పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. గిరిజన విద్య పట్ల టీడీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పాలక నారాయుడు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ఎస్ చట్టం రద్దు చేయాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

దత్తిరాజేరు: మానాపురం సంతతోట వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు రాస్తారోకో చేపట్టారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆటో యూనియన్ నాయకులు బి.అప్పలనాయుడు, కె.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇప్పటికే ఐపీఎస్ చట్టం ఉంటుండగా బీఎన్ఎస్ చట్టం తెస్తూ జరిమానాలు, జైలు శిక్షలు కఠినంగా పెట్టడం మోడీ దుర్మార్గానికి మచ్చుతునకని వారు ఆరోపించారు. ఆటో కార్మికులు జీవనానికి తీరని దెబ్బగా ఈ చట్టం ఉంటుందని అభద్రతో పనిచేయాల్సి వస్తుందని, కుటుంబాల పోషణకు అడ్డంకిగా మారుతోందని అన్నారు. మోడీ అధికారంలోకి రాగానే ముందుగా జూలై 1 నుంచి ఈ చట్టాన్ని అమలు చేయడానికి అనుకుంటున్నారని, ఈ దుర్మార్గానికి అడ్డుకట్ట వే యడానికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత పడాలని కోరారు. కార్యక్రమంలో బంగారయ్య, రమేష్, గౌరీ, వెంకటేషు, గణపతి, గౌరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

విజయనగరం దాసన్నపేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్క నాటాలని బీజేపీ సీనియర్ నాయకులు, స్వచ్ఛభారత్ కో-ఆర్డినేటర్ కుసుమంచి సుబ్బారావు అన్నారు. మంగళవారం పూల్‌బాగ్‌లోని సరస్వతి శిశు మందిర్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

కారు ప్రమాదంలో యువకుడి మృతి

ఒడిశా

రాయగడ: మునిగుడ సమితి అంబోదల సమీపంలోని బొందుగుడ రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడకు చెందిన ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి అంబోదల పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడకు చెందిన ఐదుగురు యువకులు బరఘడ్‌లో ఓ వివాహ వేడుకలో వంటలు చేయడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తమ కారులో వస్తుండగా బొందగుడ సమీపంలో కారు ప్రమాదానికి గురై ఇరవై అడుగుల లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఓ యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందగా... ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బంది సాయంతో క్షతగాత్రులను మునిగుడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారులో చిక్కుకుపోయిన యువకుని మృతదేహాన్ని అతికష్టం మీద బయటకు తీశారు. అంబోదల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు: గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని.. గత ఐదేళ్లలో గిరిజనులకు పూర్తిగా అన్యాయం చేశారని గిరిజన సంక్షేమ శాఖ, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. సాలూరులోని తన నివాసంలో ఆమె మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. అరకు ఎంపీ తనూజారాణి మొదటి రోజు లోక్‌సభ సమావేశంలో నచ్చినట్లు ఎవరో రాసిన స్క్రిప్ట్ చదివేశారని ఎద్దేవా చేశారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని అన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తేస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం అక్కడ మోకరిల్లిందని విమర్శించారు. గిరిజనులకు ఉద్యోగాలు కల్పించాలని ఎన్టీఆర్ జీవో నెం3ను తీసుకొచ్చారని గుర్తు చేశారు. దీనిని సుప్రీంకోర్టులో కొట్టివేసి నాలుగేళ్లవుతున్నా సైకో ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. గత ప్రభుత్వంలో అడవులను పూర్తిగా ధ్వంసం చేసి.. మైనింగ్ వ్యాపారంతో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారని ఆమె ఆరోపించారు. ఐటీడీఏ, జీసీసీలను పూర్తి స్థాయిలో నిర్వీర్యం చేశారన్నారు. వెదురు కోసం గిరిజనులు అడవులకు వెళితే వారిపై కేసులు పెట్టారని అన్నారు. కాఫీకి బదులు గంజాయి తోటలు పెంచాలని వైసీపీ నేతలు గిరిజనులపై ఒత్తిడి తెచ్చారని అన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకుంటాం

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: మండలంలో గడిచిన ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నిధుల దుర్వినియోగంపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక వెలుగు సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పథకం కింద చేపట్టిన పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కొన్ని పాఠశాలలకు ఇప్పటికీ మరమ్మతులు చేయకుండా నిధులు దుర్వినియోగమైనట్టు తన దృష్టికి వచ్చిందని.. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మరుగుదొడ్లు, తాగునీరు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

ఎరువులు అందుబాటులో ఉండాలి

గిరిజన రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉండేలా వ్యవసాయాధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచించారు. దీనిపై వ్యవసాయాధికారి ప్రియా శ్రీదేవి మాట్లాడుతూ ఎరువులు నిల్వ చేయడానికి గోదాములు అందుబాటులో లేవని తెలిపారు. 29 రైతుభరోసా కేంద్రాలకు నలుగురు వీహెచ్ఏలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అమలవుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి గిరిజనులు లబ్ధిపొందడం లేదని ఎమ్మెల్యే ఆరోపించారు. మండలానికి 23 ఫిష్ ఆంధ్రా యూనిట్లు ఇచ్చినప్పటికీ ఒక్కటి కూడా పనిచేయడం లేదని, ఈ పథకం కింద నిధులు దుర్వినియోగమైనట్టు ఆరోపణలు వస్తున్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ గోపీకృష్ణ ఆదేశించారు.

సోలార్ యూనిట్లు పనిచేయడం లేదు

గిరిజనుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్లు ఎక్కడా పనిచేయడం లేదని.. మరమ్మతులు కూడా చేయని పరిస్థితి నెలకొందని.. దీనివల్ల తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని ఎమ్మెల్యే వివరించారు. జలసిరి యూనిట్లు దుర్వినియోగం అవుతున్నాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాపారావు, ఏపీవో విద్యాసాగర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో గీతాంజలి, ట్రైబుల్ వెల్ఫేర్ డీఈ కృష్ణకుమార్, సీడీపీవో రంగలక్ష్మి, జీసీసీ మేనేజర్ దాసరి కృష్ణ, ఈవోపీఆర్‌డీ కె.సత్యం, ట్రాన్స్‌కో ఏఈ జి.నీలిమ, ఇమరిక పవన్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులు మెరుగుపర్చండి

పాలకొండ: పాలకొండ-వీరఘట్టం ఆర్అండ్‌బీ పరిధిలో ఉన్న ప్రధాన రహదారి మరమ్మతులకు గురైందని, తక్షణమే మెరుగు పరచాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆర్అండ్‌బి జేఈ రాజుకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవగాం, జంపరకోట రహదారి పనులు వేగవంతంగా చేయాలని ఆదేశించారు. గోపాలపురం, అంపిలి గ్రామాలకు సంబంధించి ఆర్‌డబ్ల్యూఎస్ పనులు నిర్వహిస్తున్న దృష్ట్యా ఆయా పంచాయతీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈకు ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకత పాటించాలన్నారు. ఎం.సింగుపురం తదితర గ్రామాల్లో పనులకు వెళ్లకుండానే మస్టర్లు వేస్తున్నారని, వాటిని నిరోధించాలని ఆయన ఆదేశించారు. కొన్ని గ్రామాల్లో చిరుద్యోగులకు ఉపాధి పనులకు వెళుతున్నారని, వాటిని అరికట్టాలన్నారు. చీపురుపల్లి వద్ద రైల్వే వంతెన పనులు ఆలస్యంగా వేయడంతో ఆర్టీసీకి నష్టం వస్తుందని, త్వరితగతిన పనులు చేయించాలని ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరరావు సమావేశం దృష్టికి తెచ్చారు. చీరుపుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు దృష్టికి తీసుకొచ్చి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామకృష్ణ, మండల ప్రత్యేకాధికారి అశోక్, తహసీల్దార్ వరహాలు, టీడీపీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, గండి రామినాయుడు, జాడ శ్రీధర్, కిమిడి కాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో పింఛన్లు అందజేత



గరుగుబిల్లి: విశాఖలోని ఆస్పత్రిలో పింఛన్ అందజేస్తున్న దృశ్యం



పాచిపెంట: తగరపువలసలోని ఆస్పత్రిలో..

గరుగుబిల్లి: విశాఖపట్నంలోని ఓ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండల కేంద్రానికి చెందిన నల్ల శ్రీరాములునాయుడుకు వెల్ఫేర్ అసిస్టెంట్ పూడి మన్మథరావు మంగళవారం ఉదయం వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు. విశాఖ వెళ్లి పింఛన్ అందజేయడం పట్ల మన్మథరావును స్థానికులు అభినందించారు. ● **పాచిపెంట:** అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన వృద్ధుడికి స్థానిక మండల పరిషత్ ఉద్యోగి శ్రీనివాసరావు పింఛన్ అందజేశారు. సుమారు 100 కిలో మీటర్ల దూరంలోగల విశాఖ జిల్లా తగరపువలసలోని ఆసుపత్రికి వెళ్లి రూ.7వేలు పింఛన్ అందజేశారు. పాచిపెంటకు చెందిన మారోజు వెంకటరమణ ఈనెల ఒకటో తేదీన పింఛన్ అందుతుందని వేకువజాము నుంచి ఎదురు చూశాడు. ఈలోగా బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో సాలూరు తీసుకువెళ్లగా.. తగరపువలస రిఫర్ చేశారు. ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేయడంతో ఆ కుటుంబ సభ్యుల ఆనందానికి అవధులు లేవు. పింఛను అందజేసిన శ్రీనివాసరావును మండల టీడీపీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్‌బాబు, ఎంపీడీవో లక్ష్మీకాంత్ తదితరులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ఉమామహేశ్వరి

వీరఘట్టం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి పాలవలస ఉమామహేశ్వరి చెప్పారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రదీప్, శాంతికుమారి, ఆదిలక్ష్మి, జనార్దనరావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కిషోర్

భామిని: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.కిషోర్ కుమార్ సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సచివాలయ సమస్యలు, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులున్నా తెలియజేయాలని సూచించారు.

నూతన చట్టాలపై అవగాహన

పాలకొండ: భారతీయ నూతన చట్టాలపై పాలకొండ లీగల్ సెల్ సర్వీసెస్ అడ్వకేట్ ఎం.వెంకటేశ్వర రావు పాలకొండ సబ్‌జైలు సిబ్బందికి మంగళవారం అవగాహన కల్పించారు. ఈనెల ఒకటో తేదీ నుంచి భారత ప్రభుత్వం ఈ చట్టాలను అమలులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఇకపై అన్ని రకాల కేసులు తీవ్రతను బట్టి పోలీసులు నమోదు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, హెడ్‌వార్డర్లు పి.చంద్రరావు, సత్యారావు పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మంగరాజు వెల్లడించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమల్లోకి వచ్చిన కొత్త చట్టాలతో కేసుల దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు సత్వర న్యాయం అందుతుందన్నారు. కొత్త నేర చట్టాలు సోమవారం నుంచి అమల్లోకి వచ్చాయని సీఐ తెలిపారు.

దోమల నివారణపై దృష్టి

భామిని: దోమల నివారణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి సోహెల్ సూచించారు. డెంగ్యూ నివారణా మాసోత్సవం సందర్భంగా బొడ్డగూడలో అవగాహనా ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఆయన డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించారు. డెంగ్యూ సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాగునీటి కష్టాలు

● రోడ్డు మరమ్మతుల్లో భాగంగా మార్చిన పైపులైన్లు
● తగ్గిన సరఫరా ● ఇబ్బందులు పడుతున్న మహిళలు



నీరు తక్కువగా వస్తుండడంతో వేచిఉన్న మహిళలు

వీరఘట్టం: వీరఘట్టం దిగువ వీధిలో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు మరమ్మతుల్లో భాగంగా పైపులైన్లు మార్చిన తర్వాత తాగునీరు తక్కువగా వస్తోందని మహిళలు వాపోతున్నారు. అందరికీ నీరు అందక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ సరిచేయాలని, పూర్తిస్థాయిలో నీరు వచ్చేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విస్సీ ప్రవల్లిక వద్ద ప్రస్తావించగా పైపులైన్లు పరిశీలించి సరిచేస్తామన్నారు.

గురండి సెంటర్‌లో మరో గుంత



రోడ్డు మధ్యలో గుంత ఏర్పడిన దృశ్యం

భామిని: ఇప్పటికే అలికాం-బత్తిలి రహదారి అడుగడుగునా గుంతలతో నిండిపోయింది. తాజాగా గురండి సెంటర్‌లో భారీ గుంత ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజుల క్రితం భారీ వాహనం రోడ్డు మధ్యలో ఇరుక్కోవడంతో గుంత ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. వర్షాలు పడి ఆ గుంతలో నీరు చేరితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని ఈ ప్రాంతీయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యుద్ధ ప్రాతిపదికన గుంతను పూడ్చాలని వారు కోరుతున్నారు.

ఎరువులు స్వాధీనం



ఎరువుల బస్తాలను స్వాధీనం చేసుకున్న దృశ్యం

పాచిపెంట: ఒడిశా రాష్ట్ర సరిహద్దు గ్రామాలకు అనధికారికంగా తరలిపోతున్న సుమారు రూ.11వేలు విలువైన 28 బస్తాల ఎరువులను సీజ్ చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలూరు మన గ్రోమోర్ నుంచి 15 బస్తాలు, పాచిపెంట నుంచి 13 బస్తాల ఎరువులను ఆత్మకూరు శ్రీనివాసరావు ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. ఎరువుల బస్తాలను పొట్టంగి మండలం కందిలి, పేటూరు గ్రామాలకు తరలిస్తుండగా రొడ్డవలస సమీపంలో పట్టుకున్నామని తెలిపారు. ఎరువులను పందుకోవలస రైతుభరోసా కేంద్రం లో భద్రపరిచినట్లు ఏవో చెప్పారు. వీఏఏలు మోహన్‌కృష్ణ, వినోద్, కిరణ్ పాల్గొన్నారు.

రేపు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్

కురుపాం: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో విఫలమైందని, వెంటనే నీట్ పరీక్షను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు పి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈనెల 4న దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం కురుపాంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు రంజిత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: బెంగళూరులో ఈనెల 14న జరగనున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ మహాసభలకు వేదిక రాష్ట్ర కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ హాజరు కానున్నారు. ఈసందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ మన్యంలో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించడానికి వేదిక పని చేస్తుందని తెలిపారు.

క్లుప్తంగా..

సాయిరాంను కలిసిన ఎన్జీవో నాయకులు

పాలకొండ: ఎన్జీవో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాంకు ఇటీవల శ్రీకాకుళం మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పదోన్నతి రావడంతో మంగళవారం పాలకొండ డివిజన్ ఎన్జీవో యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సాయిరాంను కలిసిన వారిలో పాలకొండ డివిజన్ గౌరవ అధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం, అధ్యక్షుడు రంగాచారి, తహసీల్దార్ నరసింహమూర్తి, కార్యదర్శి పైల ఈశ్వరరావు, రమేష్ కుమార్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రమశిక్షణ అవసరం

గుమ్మలక్ష్మీపురం: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని భద్రగిరి ఏపీ ఆర్ఎస్ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ యుగంధర్ విద్యార్థులకు సూచించారు. కళాశాలలో మంగళవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. విద్యాభివృద్ధిలో తల్లిదండ్రులు ప్రముఖ పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన కుక్ సుబ్బమ్మకు సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు సత్కరించారు.

మొక్కలు నాటుదాం



పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

వీరఘట్టం: చినగోర ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంగళవారం శ్యాంప్రసాద్‌ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి గుణుపూర్ వెంకటనాయుడు, టీడీపీ నాయకులు దేవుపల్లి ఆనందరావు, లక్ష్మణరావు, గేదెల వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకం

గరుగుబిల్లి: తోటపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.రాఘవేంద్రరావు అకాల మరణం చెందారు. ఆయన కుమారుడు సూర్యప్రభాకర్‌కు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సహాయకునిగా నియమిస్తూ జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్ పాల్గొన్నారు.